క్లుప్తంగా

ఓటర్లకు ఇబ్బంది ఎదురుకావొద్దు



కేంద్రంలో పరిశీలిస్తున్న ఏఆర్ఓ

చంద్రుగొండ: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది ఎదురుకాకుండా అన్ని వసతులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సంధ్యారాణి సూచించారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించిన ఆమె వసతుల కల్పనపై ఉద్యోగులకు సూచనలు చేశారు. ఆమె వెంట ఉద్యోగులు రఘు పాల్గొన్నారు.

చర్చ లేకుండానే మండల సభ

మణుగూరు రూరల్: మణుగూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటుచేశారు. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన అభివృద్ధి పనులు, సమస్యలపై ఎలాంటి చర్చలు లేకుండానే సమావేశం ముగించారు. కాగా, ఇటీవల అనారోగ్యంతో మరణించిన పగిడేరు ఎంపీటీసీ కుంజా కృష్ణకుమారికి సంతాపంగా మౌనం పాటించచారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులం, మోడల్ స్కూల్‌కు నలుగురు ఎంపిక



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: మండలంలోని గంగోలు ఎంపీపీఎస్ విద్యార్థులు నలుగురు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం కవిత తెలిపారు. పాఠశాల విద్యార్థులు కుసిని గౌతమ్, సున్నం గాయత్రీ, డేగల విన్యశ్రీ, కుసిని అక్షర గురుకులంలో ఐదో తరగతి ప్రవేశానికి ఎంపిక కాగా, బొమ్ముల స్నేహలత మోడల్ స్కూల్‌లో ఆరో తరగతికి ఎంపికైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, గ్రామస్తులు శుక్రవారం అభినందించారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీరామ్మూర్తి

అశ్వారావుపేటరూరల్: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను సన్మానించారు. ఎస్సెస్సీలో 10జీపీఏ సాధించిన జవహర్ విద్యాలయం, సూర్య, గౌతమి స్కూళ్ల విద్యార్థులు కె.పల్లవి, షిమా కౌసిక్, ఎం.ప్రీతిక ప్రిన్సెస్‌ను శుక్రవారం ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యాన సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల బాధ్యులు, బీఆర్ఎస్ నాయకులు నారాయణరావు, ఖలీల్ బాషా, శ్యాం, ఇనుగంటి ప్రవీణ్, మైథిలి, రాంబాబు, కొఠారు చలపతి, ప్రకాశ్‌రావు, సంకా ప్రసాద్, జుజ్జురపు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

దమ్మపేట: ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు శుక్రవారం ప్రచారం చేశారు. దమ్మపేటలోని మల్కారం రోడ్డులో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు అత్తులూరి వెంకటరామారావు, పగడాల రాంబాబు, పందేటి వెంకటేశ్వరరావు, పసుమర్తి చిన్నబాబు, చక్కిరాల మల్లేశ్వరరావు, తాళ్ల శంకర్, పగడాల కృష్ణ, పి.కృష్ణమూర్తి, అయ్యప్ప, షేక్ బాషా, ఉలవల రాంబాబు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

బూర్గంపాడు: ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని సారపాకలో శుక్రవారం నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జహూర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ నాయకుడు బొల్లోజు అయోధ్య పాల్గొని జెండా ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు పేరాల శ్రీనివాస్, మువ్వ వెంకటేశ్వరరావు, ఎండీ సాజిద్, ముంతాజ్, వహీద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: వివాహిత అదృశ్యమైన ఘటనపై శుక్రవారం కేసు నమోదైంది. మండల కేంద్రంలోని కాళింగుల బజార్‌కు చెందిన మూల అనూష రెండేళ్ల కుమారుడితో కలిసి గురువారం దమ్మపేట మండలం అల్లిపల్లిలో వివాహానికి వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరింది. ఆమె శుక్రవారం కూడా రాకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు.

ప్రారంభమైన హోం ఓటింగ్

- ఇంటి వద్దే ఓటు వేసిన దివ్యాంగులు, వయోవృద్ధులు
- పలుచోట్ల పర్యవేక్షించిన అధికారులు



బూర్గంపాడు : నాగినేనిప్రోలులో హోమ్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

బూర్గంపాడు/మణుగూరురూరల్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వయోవృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉద్యోగులు అర్హుల ఇళ్లకు వెళ్లి ఓటు వేయించారు. పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 123 మంది దివ్యాంగులు, వృద్ధులు దరఖాస్తు చేసుకోగా, తొలిరోజు 117మంది ఓటు వేశారని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్లలో ఓటింగ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. హోం ఓటింగ్ ఈనెల 8వ తేదీ వరకు పూర్తి చేయాలని, ఓటర్లకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు ముజాహిద్, రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఆర్ఐలు లీలావతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగుల కోసం మణుగూరు తహసీల్ ఆవరణలోని ఇందిరాక్రాంతి భవనంలో ఓటింగ్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని, అక్కడ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రతీక్‌జైన్ సూచించారు.

ప్రశాంతంగా హోం ఓటింగ్

భద్రాచలంఅర్బన్: హోం ఓటింగ్ ప్రక్రియ శుక్రవారం భద్రాచలంలో ప్రశాంతంగా జరిగింది. మొత్తం 25 మంది వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా, తొలిరోజు 23మంది ఓటు వేశారు. అధికారులు ఉపేందర్, వెంకటేష్ ఆధ్వర్యాన ఓట్లు వేయించారు.



భద్రాచలం అర్బన్ : హోం ఓటు వేస్తున్న వృద్ధుడు

ఇంటి వద్ద ఓటుకు 172 మంది వృద్ధులు

కరకగూడెం మండలంలో..

కరకగూడెం: పినపాక మండలంలో 12మంది, కరకగూడెం మండలంలో 29మంది హోం ఓటింగ్ పూర్తయిందని తహసీల్దార్లు సూర్యనారాయణ, నాగప్రసాద్ తెలిపారు. ఈకార్యక్రమాల్లో ఆర్ఐలు వీరభద్రం, బాలకృష్ణ, రాజు, ఏపీఓలు జ్యోతి, త్రిగుణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో నేటి నుంచి..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నియోజకవర్గంలో శనివారం నుంచి ఈనెల 6వ తేదీ వరకు హోం ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు సహాయ రిటర్నింగ్ అధికారి వేణుగోపాల్ తెలిపారు. నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, చంద్రుగొండ మండలాల పరిధిలో 172మంది దరఖాస్తు చేసుకోగా, వారి ఇంటికి వెళ్లి ఓటు వేయిస్తామని తెలిపారు.



మణుగూరు రూరల్ : ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు

ఎంపీగా కవిత విజయానికి కృషి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు

భద్రాచలం: లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిని మాలోత్ కవిత గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు కోరారు. భద్రాచలంలో శుక్రవారం నిర్వహించిన బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ సుభిక్షంగా ఉండగా.. ఇప్పుడు సైతం తెలంగాణ హక్కులు కాపాడుకోవాలన్నా, అభివృద్ధికి నిధులు సాధించాలన్నా బీఆర్ఎస్ ఎంపీల గెలవాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఈమేరకు హామీల అమలును విస్మరించిన కాంగ్రెస్ తీరును ప్రజలకు వివరించి కవిత విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు మానే రామకృష్ణ, ఆకోజు సునీల్‌కుమార్, పడిసిరి శ్రీనివాస్, ఉడతా రమేష్, రేపాక పూర్ణచంద్రరావు, కోలా రాజు, కాపుల సూరిబాబు, వీరబోయిన వెంకటనరసమ్మ, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.



భద్రాచలం : సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు

ఎన్నికల ప్రచారం ప్రారంభం

దుమ్ముగూడెం/చర్ల రూరల్: బీఆర్ఎస్ అభ్యర్థి కవితను గెలిపించాలని కోరుతూ దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో నాయకులు శుక్రవారం ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దుమ్ముగూడెంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారయణమూర్తి, చర్లలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మండల అధ్యక్షుడు సోయం రాజారావు ప్రచార వాహనాలను ప్రారంభించి ప్రచారం మొదలుపెట్టారు. నాయకులు కణితి రాముడు, జానీపాషా, తునికి కామేష్, మడకం రామారావు, దామెర్ల శ్రీనివాసరావు, జీలకర్ర గంగరాజు, కొండపల్లి నరేంద్ర, తంత్రంపల్లి వెంకటేశ్వరావు, నోముల రాంరెడ్డి, అనిల్, దొడ్డి తాతారావు, కాపుల కృష్ణార్జునరావు, ఎస్.డీ.అజీజ్, చింతా నాగబాబు, ఇర్సవడ్ల రాము, గొర్ల రాజబాబు, దొడ్డి సూరిబాబు, పోలూరి సుజాత, గోసుల మురళి, తుర్రం రవి, కాకి అనిల్, తోటమళ్ల రవి, పంజా రాజు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

దుమ్ముగూడెం: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని దుమ్ముగూడెం సీఐ అశోక్ తెలిపారు. మండలంలోని లక్ష్మీనగరంలో శుక్రవారం సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్, దుమ్ముగూడెం పోలీసులు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా, బెదిరింపులకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సీఆర్పీఎఫ్ 141ఏ అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జునన్, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు కాశయ్య, నాదఫ్, ఎస్ఐ కేశవరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం : ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న సీఆర్పీఎఫ్, పోలీసు బలగాలు

ఆళ్లపల్లి మండలంలో..

గుండాల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన ఆళ్లపల్లి పోలీసులు మండలంలోని ఆళ్లపల్లి, వెంకటాపురం, మర్కోడు గ్రామాల్లో శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతత వాతావరనంలో జరిగేలా అందరూ సహకరించాలని సూచించారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఏఎస్సై వెంకటరెడ్డి, ఉద్యోగులు శ్రీనివాస్, ఉపేందర్, రాజేశ్వరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త

చంద్రుగొండ/అశ్వారావుపేట రూరల్: నానాటికీ ఎండలు పెరుగుతున్నాయి. ఉష్ణోగ్రతకు తోడు వడగాలులు వీస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖాధికారులు సూచిస్తున్నారు. ఈమేరకు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను చంద్రుగొండ మండల వైద్యాధికారి కనకం తనూజ, అశ్వారావుపేట మండలం పీహెచ్‌సీ వైద్యాధికారి మధులిక వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. చిన్నారులు, వృద్ధుల విషయంలో అప్రమత్తంగా ఉంటూ మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 4 గంటల వరకు సాధ్యమైనంత వరకు బయటకు రావొద్దని, తప్పనిసరై వస్తే గొడుగు ఉపయోగించడంతో పాటు నెత్తిపై టోపీ లేదా రుమాలు ధరించాలని, వదులైన తెల్లటి కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. అలాగే, నీరు, పుచ్చకాయ ఇతర పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని, ఆహారంలో మాంసహారం, మసాలాలు, కారం, ఉప్పు తగ్గించాలని తెలిపారు. ఇక తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం రావడం, మత్తు, కలవరింత, ఫిట్స్, పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారక స్థితిలోకి వెళ్లడాన్ని వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలని ఆమె పేర్కొన్నారు. బాధితులను సత్వరమే చల్లటి ప్రదేశానికి చేర్చి జ్వరం తగ్గే వరకు చల్లటి గుడ్డతో శరీరం తుడవాలని, పరిస్థితి విషమించక ముందే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు.

పొత్తు ధర్మాన్ని పాటించాలి

అశ్వారావుపేటరూరల్: పార్టీ నిర్ణయం మేరకు కార్యకర్తలంతా లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయానికి కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కోరారు. మండలంలోని వినాయకపురంలో గడ్డం సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ కులమతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని ఆరోపించారు. అలాగే, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకుఅప్పగిస్తోందని తెలిపారు. ఈమేరక ఇండియా కూటమి నిర్ణయం మేరకు కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి పార్టీ శ్రేణులు పాటుపడాలని కోరారు. నాయకులు బి.చిరంజీవి, ముళ్లగిరి గంగరాజు, సోడెం ప్రసాద్, మడిపల్లి వెంకటేశ్వరరావు, తగరం జగన్నాధం పాల్గొన్నారు.

లక్ష్మీకాలనీలో వైద్య శిబిరం

చర్ల రూరల్: మండలంలోని లక్ష్మీకాలనీ, డబుల్ బెడ్‌రూం ఏరియాల్లో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈసందర్భంగా కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ ఆధ్వర్యాన జ్వరంతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆతర్వాత ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటిని తొలగించడంతో పాటు దోమల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ బారి నుంచి కాపాడుకోవాల్సిన అంశంపై అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చర్ల రూరల్: పరీక్షలు చేస్తున్న వైద్యుడు, సిబ్బంది

అశ్వాపురంలో...

అశ్వాపురం: తెలంగాణ భవన నిర్మాణ సంక్షేమ మండలి ఆధ్వర్యాన సీఎస్‌సీ సంస్థ బాధ్యులు మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల మల్లికార్జున్ ప్రారంభించగా.. కార్మికులు, స్థానికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. నాయకులు రాజేష్, పవన్‌సాయి, శ్రీకాంత్, మల్లెబోయిన లింగయ్య, నాగేందర్, సీఎస్‌సీ సంస్థ కోఆర్డినేటర్ మహేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతరలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయం

కరకగూడెం: నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా నిరంతరం పాటుపడతానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని తోగ్గూడెంలో జరుగుతున్న పాయం వంశీయుల గడి కామరాజు జాతరకు శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు స్వాగతం పలకగా ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఏ సమస్య ఉన్నా ప్రజలు తనను నేరుగా కలవొచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం: సొంత మండలమైన దుమ్ముగూడెం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. మండలంలోని ములకపాడులో శుక్రవారం ఆయన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తానని పేర్కొన్న ఆయన నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని తెలిపారు. జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, నాయకులు లంకా శ్రీనివాసరావు, తెల్లం హరికృష్ణ, మట్టా శివాజీ, కెల్లా శేఖర్, ముర్రం వీరభద్రం, మద్ది శ్రీనివాసరెడ్డి, గడ్డం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికోద్యమంలో ఐఎన్‌టీయూసీకి ప్రత్యేక స్థానం

ఆవిర్భావ వేడుకలో ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్

మణుగూరు టౌన్: భారత కార్మికోద్యమ చరిత్రలో ఐఎన్‌టీయూసీది ప్రత్యేక స్థానమని, ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన కార్మిక సంఘంగా చరిత్ర సృష్టించిందని యూనియన్ ప్రధాన కార్యదర్శి చిన్మయి త్యాగరాజన్ అన్నారు. ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మణుగూరు పీకేఓసీ –2 నూతన కార్యాలయంలో జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ వ్యక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలను అప్పజెప్పి, ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మణుగూరు ఏరియా ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు, బ్రాంచి కార్యదర్శి సిల్వేరు గట్టయ్య, నాయకులు కృష్ణ చేతన్, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న త్యాగరాజన్

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ,రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. మండలంలోని పట్వారిగూడెంలో శుక్రవారం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించాక మాట్లాడారు. పార్టీలో చేరిన కొత్త నాయకులు, పాత నాయకులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఎంపీ అభ్యర్థి విజయానికి పాటుపడాలని తెలిపారు. కాగా, మండలంలోని ముకుందాపురానికి చెందిన కొర్సా తిరుపతిరావు అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే పరామర్శించారు. ఆతర్వాత చిన్నగొల్లగూడెంలో మాజీ సర్పంచ్ బంటు గోపి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

కాంగ్రెస్‌లో చేరిక

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో శుక్రవారం చేరారు. జానకీపురం, మైబునగర్, రంగాపురం గ్రామాల నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు బానావత్ భీముడు, వేముల రమణ, పర్సా వెంకటేశ్వర్లు, దుబ్బాకుల రాము తదితరులు పాల్గొన్నారు.

40 లీటర్ల నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని తోగ్గూడెం నుంచి తరలిస్తున్న నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కేశవరావు శుక్రవారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ ఆధ్వర్యాన శుక్రవారం తోగ్గూడెం శివారులో వాహన తనిఖీలు చేపట్టగా మోటార్ సైకిల్‌పై వస్తున్న అనుమానాస్పదంగా కనిపించాడని పేర్కొన్నారు. ఆయనను విచారించగా సుజ్ఞానపురానికి చెందిన భూక్యా లాల్‌గా తేలిందని, ఆయన వద్ద 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాటుసారా విక్రయదారుల బైండోవర్

చర్ల: మండలంలో నాటుసారా విక్రయిస్తున్న 12 మందిని శుక్రవారం ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సారా విక్రయిస్తున్న వీరిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేశామని అధికారులు తెలిపారు.

లాడ్జీలు, ఫంక్షన్ హాళ్లలో తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివరామకృష్ణ

అశ్వారావుపేటరూరల్: లోక్‌సభ పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. అశ్వారావుపేట ఎస్సై శివరామకృష్ణ ఆధ్వర్యాన శుక్రవారం అశ్వారావుపేటతో పాటు మండలంలోని వినాయకపురంలోని లాడ్జీ లు, ఫంక్షన్ హాళ్లలో తనిఖీ చేశారు.లాడ్జీల్లో గదులు అద్దెకు తీసుకున్న వారి వివరాలపై ఆరా తీశారు. ప్రతీ ఒక్కరి గుర్తింపు కార్డులు పరిశీలించాలని, అన్ని వివరాలు తెలుసుకున్నాకే గదులు కేటాయించాలని నిర్వాహకులకు సూచించారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

అశ్వాపురం: అనారోగ్యంతో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కందుల కృష్ణార్జున్‌రావును శుక్రవారం మహబూబాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ పరామర్శించారు. అశ్వాపురంలోని ఆయన నివాసంలో కృష్ణార్జున్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు ముస్కు శ్రీనివాసరెడ్డి, భిక్షపతి, బాలరాజు, ఐలయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.